www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -361 బుధవారం 8 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ఒక్క రాత్రిలో నాశనం చేస్తా



'హార్ముజ్'ను తెరవాల్సిందే : ట్రంప్ హెచ్చరిక

- ఖర్గ్ సహా ఇరాన్ వ్యాప్తంగా దాడులు ముమ్మరం
- వంతెనలు, రైల్వే మార్గాలు, ఎయిర్‌పోర్టుపై దాడులు
- తాజా దాడుల్లో 18మంది మృతి
- మేము రెడీ : ఇరాన్
- విద్యుత్ ప్లాంట్ల చుట్టూ మానవ హారాలు



**టెహ్రాన్ :న్యూఢిల్లీఏప్రిల్ 7 (ప్రజావినికిడి):** తమ డిమాండ్లను ఆమోదించకుండా పెడచెవిన పెట్టిన నేపథ్య ంలో ఇరాన్ నాగరికతను ఒక్క రాత్రిలో నాశనం చేస్తామని బెదిరించారు. "ఈ రాత్రికే మొత్తం నాగరికత అంతరిస్తుంది. తిరిగి దానిని ఎన్నటికీ పునరుద్ధరించలేం. అలా జరగాలని నేను కోరుకోవడం లేదు. కానీ బహుశా జరగవచ్చు." అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అంతకుమించి ఆయన వివరాలివ్వలేదు. కానీ, ఇరాన్ వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు, ఇతర పౌర సదుపాయాలే ఇక తమ లక్ష్యాలుగా ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ఇప్పటికే హెచ్చరించారు.
కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని లేదా హార్ముజ్ జలసంధిని తెరవాలని లేదంటే **మిగతా 2లో...**

## విజయన్, మోడీ మంచి మిత్రులు

రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్

కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది

ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు

**తిరువనంతపుర ఏప్రిల్ 7 (ప్రజావినికిడి)** ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారనికేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందరే **మిగతా 2లో...**





## బెంగాల్‌పై కన్నేస్తే.. పాక్ ముక్కలే

పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్

రెచ్చగొట్టే ప్రకటనలై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీఏప్రిల్ 7 (ప్రజావినికిడి):** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంరగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో **మిగతా 2లో...**

## అణుశక్తిలో భారత్ ఘనత.. కల్పక్కం రియాక్టర్ క్రిటికాలిటీ!

- అణుశక్తి కార్యక్రమంలో కీలకమైన రెండో దశలోకి అడుగుపెట్టిన భారత్
- వాడిన ఇంధనం కంటే ఎక్కువ ఇంధనాన్ని ఉత్పత్తి చేయగల ప్రత్యేక టెక్నాలజీ
- ఈ ఘనత సాధించిన ప్రపంచంలో రెండో దేశంగా భారత్ ఆవిర్భావం
- భవిష్యత్తులో ధోరియం నిల్వల వినియోగానికి ఇది కీలక ముందడుగు

2లో.



## ఏబీఎన్ ఆఫీస్ వద్ద వైసీపీ శ్రేణుల ఆందోళన..

- ఆర్కే వీకెండ్ కామెంట్ కథనంపై వైసీపీ శ్రేణుల నిరసన
- ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయం ముట్టడికి యత్నం
- మావిగన్ వివాదాన్ని పక్కదోవ పట్టించేందుకేనని విమర్శలు
- అపోలో ఆసుపత్రి రోగులకు తీవ్ర అసౌకర్యం



2లో.

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

బిఆర్ఎస్, బిజెపిలకు అధికారం కల్ల

-నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రమంలో పిసిసి చీఫ్



## తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

- కర్రెగట్టుల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు
- మావోయిస్టు అడ్డా అభివృద్ధి పరుగులు
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

**ములుగు,ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. **2లో...**



## రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

బిఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం

హరీష్ రావు తదితరుల అరెస్ట్‌పై కెటిఆర్ ఆగ్రహం



## అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి

అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు

పరిగి వెళ్తుండగా అప్పా జంక్షన్ వద్ద బీఆర్ఎస్ నేతల అరెస్ట్

కొద్దిసేపు హైడ్రామా, శంషాబాద్ పీఎస్‌కు తరలింపు



# కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

**బిఆర్ఎస్, బిజెపిలకు అధికారం కల్ల -నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రంలో పిసిసి చీఫ్**

**నాగర్ కర్నూల్,ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి

**అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు**

**పరిగి వెళ్తుండగా అప్పా జంక్షన్ వద్ద బీఆర్ఎస్ నేతల అరెస్ట్**

**కొద్దిసేపు హైడ్రామా, శంషాబాద్ పీఎస్‌కు తరలింపు**

**గండిపేట, శంషాబాద్‌ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
రేవంత్‌రెడ్డి పాలన అంటే గడీ, బేడీల పాలన అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్ రావు విమర్శించారు. పేదల భూములపై రాబందులా రేవంత్‌రెడ్డి వాలుతున్నాడని విమర్శించారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలివ్వాల్సింది పోయి గుంజుకుంటా రా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా భూములు కోల్పోతున్న రాపోలు, కాడ్లాపూర్ రైతులను పరామర్శించడానికి బీఆర్ఎస్ నేతలు మంగళవారం ఉదయం కోకాపేటలోని హరీశ్‌రావు ఇంటి నుంచి బయలుదేరారు. అయితే అక్కడ బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా మాజీ మంత్రులు పి.సబితారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావుతోపాటు పలువురు పరిగి బయలుదేరగా.. రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని అప్పా జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారో తెలియకపోవడంతో బీఆర్ఎస్ నేతలు పోలీసుల కాన్వారుని ఫాలో అయ్యారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలను శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పుచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా కోకాపేట, శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యమని గొప్పగా చెప్పుకునే సీఎం ఏడో గ్యారంటీ ఎక్కడీ అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు, ప్రతిపక్ష నాయకులు పోరాటం చేస్తుంటే పోలీసులను పెట్టి దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల గురించి మాట్లాడితే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారనీ, ఇప్పుడు రైతులను కలవకుండా నిర్బంధాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట భూములను లాక్కొని పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఏమిటనీ ప్రశ్నించారు. రైతులతో మాట్లాడటానికి, వారికి భరోసా కల్పించడానికి వెళ్తుంటే మార్గమధ్యలో అరెస్టు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి దౌర్జన్యాలను ఎదుర్కొంటామని, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రెండు, మూడు పంటలు పండే భూముల్లో చేపట్టిన బలవంతపు భూసేకరణ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నోటిఫికేషన్ వెనక్కి తీసుకునే వరకూ తమ పార్టీ రైతుల తరపున పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.
వికారాబాద్ జిల్లా సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ఇలాక అని, అక్కడ పచ్చని వ్యవసాయ భూములను గుంజు కోవడం దారుణమని అన్నారు. అధికారంలోకి రాకముందు పోడు భూములకు, అసైన్ భూములకు పట్టాలిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రజా పాలన పేరుతో పేదల భూములను లాక్కోవడం సరికాదన్నారు. పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్టు రాష్ట్రంలో సీఎం పాలన సాగుతోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీల భూములను వారికి దక్కకుండా చేయడం బాధాకరమన్నారు. కోహెడ వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించిన స్థలంలో కాదని మరో చోట మార్కెట్ యార్డు నిర్మిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2016 నుంచి కోర్టులో కేసు ఉన్న స్థలాన్ని మార్కెట్‌యార్డుకు కేటాయించి, ప్రభుత్వ స్థలాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడం సరికాదని తెలిపారు. కోహెడ మార్కెట్ యార్డు విషయంలో తాము చెప్పిన విషయాన్నే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఈ రోజు చెప్పారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను లాక్కోవడమే పనిగా పెట్టుకుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేదల భూములు వారికే దక్కేలా పోరాడుతామని స్పష్టం చేశారు.

**పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఉద్రిక్తత**

పరిగి మండలం కాడ్లాపూర్ గ్రామానికి ఎమ్మెల్యే హరీశ్ రావు రానుండటంతో సమావేశానికి అనుమతి ఇవ్వాలంటూ గ్రామ సర్పంచ్ పులిందర్, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య అనుమతి తీసుకునేందుకు సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పరిగి ఎస్ఐ దాన్ని డీఎస్పీకి పంపగా డీఎస్పీ అనుమతి ఇచ్చేందుకు నిరాకరించారు. సమావేశానికి అనుమతి ఇవ్వాలని సర్పంచ్ పులిందరు, తన భార్య పిల్లలతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుటే బైటాయించారు. అనుమతి ఇస్తే తప్ప ఇక్కడి నుంచి వెళ్లేది లేదని భీష్మించి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున పీఎస్‌కు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు.

# బెంగాల్‌పై కన్నేస్తే..పాక్ ముక్కలే

**మొదటిపేజీ తరువాయి**
తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఒక్క రాత్రిలో నాశనం చేస్తా

**మొదటిపేజీ తరువాయి**
ఇరాన్ వినాశనం తప్పదని అమెరికా అధ్యక్షుడు ఇచ్చిన గడువు ముగియడానికి కొద్దిగంటలే మిగిలివున్న వేళ మంగళవారం ఇరాన్ వ్యాప్తంగా పలు మౌలిక వసతులు, కీలక లక్ష్యాలపై దాడులు జరిగినట్లు వరుసగా వార్తలు అందుతున్నాయి. అలాగే ఇరాన్ ఇంధన నిల్వలకు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపంలోని పలు మిలటరీ లక్ష్యాలపై కూడా అమెరికా దాడులు జరిపింది. గుర్తు తెలియని అమెరికా సీనియర్ అధికారిని ఉటంకిస్తూ మంగళవారం యాక్సిస్ వార్తా సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. అలాగే టెహ్రాన్‌కు దక్షిణంగా, ఇరాన్ నగరమైన క్వామ్స్‌కు సమీపంలో గల వంతెనపై కూడా దాడులు జరిగాయని ప్రావిన్స్ డిప్యూటీ గవర్నర్ తెలిపారు. కొద్ది నిమిషాల క్రితమే క్వామ్స్ కమ్యూనికేషన్ లైన్లకు సంబంధించిన వంతెనల్లో ఒక దానిపై దాడి జరిగిందని గవర్నర్ మోర్తెజా హైదరి తెలిపారు. అలాగే ఇరాన్‌లోని అల్బోరాజ్ ప్రావిన్స్‌లో జరిగిన వైమానిక దాడుల్లో 18మంది మరణించినట్లు ప్రభుత్వ మీడియా తెలిపింది. ఖొరామాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా కూడా దాడులు జరిగాయని ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. మరిన్ని వివరాలు అందాల్సి వుందని పేర్కొంది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంతో సంబంధమున్న మిలటరీ స్థావరమైన పర్చిన్‌కు సమీపంలోని ప్రాంతాలపై, టెహ్రాన్‌కు నట్టనడిబొడ్డున గల కొన్ని పాయింట్లపై దాడులు జరిగాయి. క్రూయిజ్ క్షిపణి ఒక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న వీడియో ఒకటి బాగా వైరల్ అయింది. టెహ్రాన్‌లోని యూదు ప్రార్థనా మందిరం ఒకటి ఈ దాడుల్లో పూర్తిగా ధ్వంసమైందని ఇరాన్ మెహర్ వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్‌పై వరుసగా వైమానిక దాడులతో దండెత్తామని ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. అంతర్జాతీయ మధ్యవర్తుల నుంచి కాల్పుల విరమణకు ఎలాంటి ప్రతిపాదన అందలేదని ట్రంప్ ప్రకటించిన వెంటనే ఈ దాడులు ముమ్మరమయ్యాయి. కొద్దిసేపటి క్రితమే ఐడీఎఫ్ దాడులను ముగించిందని, టెహ్రాన్‌లోని తీవ్రవాద మౌలిక వసతులను నాశనం చేశామని ఇజ్రాయిల్ మిలటరీ తన అధికారిక టెలిగ్రామ్ చానెల్‌లో పేర్కొంది. ఇరాన్ వ్యాప్తంగా డజన్ల సంఖ్యలో మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని విస్తారంగా దాడులు పూర్తి చేసినట్టు తెలిపింది. అయితే ఏ ఏ స్థావరాలు, ఇతరత్రా వివరాలను వెల్లడించలేదు. ఈ దాడులతో మరోసారి ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. రికార్డు స్థాయిలో బారెల్ ధర 116 డాలర్లకు చేరింది. ఇరాన్ యుద్ధం అమెరికా అగ్ర నాయకత్వాన్ని స్తంభింపజేసిందని ఇటలీ రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. కాగా యుద్ధాన్ని నిలుపు చేసేందుకు పాకిస్తాన్ చేస్తున సానుకూల ప్రయత్నాలు, కీలకమైన దశకు చేరుకున్నాయని పాకిస్తాన్‌లో ఇరాన్ రాయబారి రెజా అమిరి మొఘాదమ్ వ్యాఖ్యానించారు.
ఇరాన్ కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 9గంటల వరకు రైళ్ళలో ప్రయాణాలు చేయవద్దని ఇరాన్ ప్రజలను ఇజ్రాయిల్ మిలటరీ హెచ్చరించింది. రైళ్ళకు, రైల్వే లైన్లకు సమీపంలో ఉన్నట్లైతే ప్రాణాలకు ముప్పు తప్పదని స్పష్టం చేసింది. అయితే ఏ ఏ ప్రాంతాల్లోని రైల్వే మార్గాలు తమ లక్ష్యాలనే వివరాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఇరాన్ కూడా అప్రమత్తమైంది. దేశంలోని మాసాద్ ఏరియా వ్యాప్తంగా రైళ్ళ రాకపోకలు నిలిచిపోయాయి.దక్షిణ లెబనాన్‌లో డిఫెన్స్ లైన్ పొడవునా తమ బలగాల మోహరింపు పూర్తయిందని ఇజ్రాయిల్ మిలటరీ మంగళవారం ప్రకటించింది. అయితే ఎక్కడ, ఎంతమంది అనే వివరాలు ఇవ్వలేదు. లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకువెళ్ళేలా ఎంత దగ్గరలో బలగాలను మోహరించిందనే సమాచారం స్పష్టంగా ఇవ్వలేదు. ఈ దశలో ఐడీఎఫ్ సైనికులు తమ యుద్ధ ట్యాంక్ విధ్వంసక క్షిపణి వ్యవస్థలతో సర్వం మోహరించి వున్నారని మిలటరీ ప్రకటన పేర్కొంది.

**రెస్క్యూ ఆపరేషన్ గురించి ఎవరు చెప్పారు?**

**జర్నలిస్టులను నిలదీసిన ట్రంప్..చెప్పకుంటే జైలుకేనని బెదిరింపు**

యుద్ధంలో ఆచూకీ తెలియకుండా పోయిన పైలట్ కోసం జరిపిన రెస్క్యూ ఆపరేషన్‌ను తమ ప్రభుత్వంలోని వారే లీక్ చేశారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. అతనో 'మచ్చ' లాంటి వాడని, అతనిని కనిపెట్టేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఇరాన్‌లో చిక్కుబడిపోయిన పైలట్ కోసం అమెరికా జరిపిన రెస్క్యూ ఆపరేషన్ గురించి ఆయన సోమవారం విలేకరులతో ముచ్చటించారు. ఆచూకీ తెలియకుండా పోయిన వైమానిక దళ అధికారి కోసం జరిపిన గాలింపు చర్యల గురించి ముందుగా వార్తను అందించిన పాత్రికేయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమాచారాన్ని ఇచ్చినవారి పేరును బయటపెట్టని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

# విజయన్, మోడీ మంచి మిత్రులు

**మొదటిపేజీ తరువాయి**
ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.

# ఏబీఎన్ ఆఫీస్ వద్ద వైసీపీ శ్రేణుల ఆందోళన..

ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రసారమైన 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' కథనంపై వైసీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హైదరాబాదులోని ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 'మావిగన్' వ్యాఖ్యలపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యజమాని, ప్రముఖ పాత్రికేయుడు రాధాకృష్ణ తన వీకెండ్ కామెంట్ లో విశ్లేషణ చేశారు. ఈ కథనం అటు ఏబీఎన్ ఛానల్ లో, ఇటు ఆంధ్రజ్యోతి దినపత్రికలో కొత్త పలుకు కాలమ్ లో ప్రచురితమైంది. ఇందులో రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ క్యాడర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.ఏపీ మహిళలను అవమానించారంటూ రాధాకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే అంశంపై మంగళవారం ఉదయం హైదరాబాద్ లోని ఫిల్మ్ నగర్ లో ఉన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ ఆఫీసును ముట్టడించేందుకు పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలివచ్చారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆఫీసు వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తప్పలేదు. సమీపంలోనే అపోలో ఆసుపత్రి ఉండడంతో చికిత్స కోసం వచ్చిన రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నా వైసీపీ శ్రేణులు వినిపించుకోలేదు. నిరసనకారులు వైసీపీ నేత అంబటి రాంబాబు నేతృత్వంలో ఏపీ నుంచి హైదరాబాద్ కు వచ్చినట్లు తెలుస్తోంది.

# అణుశక్తిలో భారత్ చారిత్రాత్మక ఘనత.. కల్పక్కం రియాక్టర్ క్రిటికాలిటీ!

**ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
భారత అణుశక్తి రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. తమిళనాడులోని కల్పక్కంలో నిర్మించిన ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (పీఎఫ్ బీఆర్) తొలిసారిగా 'క్రిటికాలిటీ'ని విజయవంతంగా సాధించింది. దీంతో మన దేశం అణు విద్యుత్ కార్యక్రమంలో అత్యంత కీలకమైన రెండో దశలోకి అధికారికంగా ప్రవేశించింది.ఒక అణు రియాక్టరులో అణు విచ్ఛిత్తి ప్రక్రియ తనకు తానుగా, స్థిరంగా కొనసాగే అత్యంత కచ్చితమైన స్థితిని 'క్రిటికాలిటీ' అంటారు. అంటే, రియాక్టరులో జరిగే ప్రతి అణు విచ్ఛిత్తి ఘటన, తదుపరి విచ్ఛిత్తిని ప్రేరేపించడానికి అవసరమైన న్యూట్రాన్లను స్థిరమైన వేగంతో ఉత్పత్తి చేస్తుందని అర్థం. అంటే, 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ రియాక్టర్ ఇక విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ చారిత్రాత్మక విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారత అణు ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక అడుగని, మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల నైపుణ్యానికి నిదర్శనమని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కొనియాడారు.ఈ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, వాడిన దానికంటే ఎక్కువ ఇంధనాన్ని (ప్లుటోనియం) ఉత్పత్తి చేస్తుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ప్రభుత్వ రంగ సంస్థ 'భవిని' దీనిని నిర్మించింది. వాణిజ్య స్థాయిలో రష్యా తర్వాత ఇలాంటి రియాక్టర్‌ను నిర్వహిస్తున్న ఘనత సాధించిన రెండో దేశంగా భారత్ నిలిచింది.భారత్ వద్ద యురేనియం నిల్వలు తక్కువగా, థోరియం నిల్వలు అపారంగా ఉన్నాయి. భవిష్యత్తులో ఈ థోరియం నిల్వలను వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేసే మూడో దశకు ఈ రియాక్టర్ ఒక వారధిగా పనిచేస్తుంది. 2026 సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయి వాణిజ్య విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2070 నాటికి 'నెట్ జీరో' లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ ముందడుగు కీలక పాత్ర పోషించనుంది.

# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

**మొదటిపేజీ తరువాయి**
'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం , సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో , టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

# రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

**బిఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం**

**హరీష్ రావు తదితరుల అరెస్ట్‌పై కెటిఆర్ ఆగ్రహం**

**హైదరాబాద్,ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):)**ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు.

# పవర్ లిఫ్టింగ్ విజేతలకు మెడల్స్ ప్రదానం




**నాంపల్లి,(ప్రజావినికిడి):** హైదరాబాద్ జిల్లా క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలు హైదరాబాద్ ఎల్బీ స్టేడియం,ఇండోర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. హైదరాబాద్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ అఖిల్ కుమార్ గౌడ్, అధ్యక్షుడు కే.మోహన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో దాదాపు 200 మంది సబ్ జూనియర్స్, జూనియర్స్ క్రీడాకారులు పాల్గొన్నారు. గెలిచిన క్రీడాకారులకు మెడల్స్, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఈ పోటీలను గత 45 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి ఇంకా ప్రోత్సాహం లభిస్తే క్రీడాకారులను మరింత మెరుగుపరచవచ్చని స్పష్టం చేశారు. ఈ నెల 18,19వ తేదీన సనత్ నగర్ లోని క్రీడా భవనంలో రాష్ట్ర పోటీలను, జాతీయ పోటీలు ఆంధ్రప్రదేశ్ అమలాపురంలో మే 15 నుండి 20వ తేదీ వరకు జరుగునున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కే.మోహన్ రెడ్డి, సెక్రటరీ కే దయానంద్ రెడ్డి, ట్రెజరర్ ఆర్.ఉదయ్ కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ త్యాగరాజు,వైస్ ప్రెసిడెంట్ సుజిత్ కుమార్,జోసెఫ్ జెమ్స్, ఎం.నాగరాజు, ఎంజి సునీల్ కుమార్, జాయింట్ సెక్రెటరీ శ్రీకాంత్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయాలు మనోవిజ్ఞాన పెంపుకు నిలయాలు

## : బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్..



**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్, బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి జిహెచ్ఎంసి లోని అన్ని డివిజన్ల లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు మనోవిజ్ఞాన పెంపుదలకు నిలయాలు అని, గ్రంథాలయాలలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించినట్లయితే విషయ పరిజ్ఞానంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రాజ శేకర్,విక్రమ్ రెడ్డి, కేశవ్ యాదవ్, యోగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామ పంచాయతీ లో ఆర్టిఐ బోర్డు ఉంచాలి

## ఎస్.హెచ్.వి.ఎస్,ములుగు జిల్లా అధ్యక్షులు యాలం.సర్వేశ్వరరావు

**వాజేడు, (ప్రజావినికిడి):**
పేరూరు గ్రామ పంచాయతీ నూతన పంచాయతీ కార్యదర్శి మహేష్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే పారదర్శకతకు పెద్దపీట వేస్తూ తీసుకున్న చర్యలు ఇప్పుడు పేరూరులో చర్చనీయాంశంగా మారాయి. పేరూరు పంచాయతీ కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం-2005 బోర్డును గమనించిన మహేష్,తక్షణమే తొలగించి ప్రజలకు సమాచార అధికారాలు మరియు నిబంధనలు స్పష్టంగా తెలిసేలా వివరాలతో కూడిన నూతన బోర్డును ఏర్పాటు చేయించారు.మండలానికే ఆదర్శంగా నిలిచింది స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేరూరు పంచాయతీని ఆదర్శంగా తీసుకుని వాజేడు మండలంలోని మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో కూడా ఇలాగే నూతన సమాచార బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




సమాచార హక్కు చట్టం అమలులో సెక్రటరీ మహేష్ చూపిన చొరవ అభినందనీయం.
ఈ చిన్న మార్పు ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతుందని, మిగిలిన పంచాయతీలు కూడా దీనిని అనుసరించాలని కోరుతున్నారు.

# నూతన భవన ప్రారంభోత్సవం



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** మంగళవారం రోజు హయత్ నగర్ డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతగా భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల రెడ్డి,నవ జీవన్ రెడ్డి,డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,భాస్కరసాగర్,మల్లేష్,దీపావళి శ్రవణ్ అలాగే కాలనీ అధ్యక్షులు సురేష్,ఉపాధ్యక్షులు నరసింహ,జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి,జాయింట్ సెక్రెటరీ నరేంద్ర స్వరూప్,కోశాధికారి గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. అనంతరం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు.
సూరారం కాలనీ వాసులు,ఎస్. అన్నపూర్ణ కి రూ



45,000/-గురుమూర్తి నగర్ వాసులు, మహమ్మద్ అజరుద్దిన్కి రూ.50,000/-,
లాల్ బహదూర్ నగర్ వాసులు ,గెహ్లావుత్ ఘనశ్యామ్ కి రూ. 60,000/-,సుభాష్ నగర్ వాసులు, కర్రోలు భారతికి రూ. 60,000/-వెంకటేశ్వర కాలనీ వాసులు,బొంతి కుమారికి రూ 60,000/-క్రిషి కాలనీ వాసులు, ముక్కర్ల హరీష్ కి రూ 37,500/-షాపూర్ నగర్ వాసులు, గార్డస్ జ్యోతికి రూ 60,000/-అందజేశారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ,
ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు,మాజీ కార్పొరేటర్ పాల క్రిష్ణ,మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి,రషీద్, సంజీవరెడ్డి,బేకు శ్రీనివాస్,బైరి ప్రశాంత్ గౌడ్, కొలన్ జీవన్ రెడ్డి, బుయ్యని శివ, సంతోష్ ముదిరాజ్, సంపంగి వెంకటేష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

# సంతాపూర్‌లో విషాదం..

## బావిలో పడి కుమారుడు మృతి. -మనస్థాపంతో తండ్రి ఆత్మహత్య

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతాపూర్ గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కుమారుడు కనిపించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన తండ్రి, అదే బావిలో దూకి ప్రాణాలు కోల్పోయిన సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.
పోలీసుల వివరాల ప్రకారం..హాజీపల్లి గ్రామానికి చెందిన సదుల ఉష ఇచ్చిన ఫిర్యాదు మేరకు,ఆమె అన్న తూర్పాటి యాదయ్య (సుమారు 40 సంవత్సరాలు) తన కుటుంబంతో కలిసి సంతాపూర్ గ్రామంలోని రఫీక్ వ్యవసాయ పొలంలో కూలి పనులు చేస్తూ నివసిస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం అతని కుమారుడు కన్నయ్య (11 సంవత్సరాలు) కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు.ఈ మేరకు 5వ తేదీన కేశంపేట పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు



నమోదు చేశారు.
కుమారుడు కనిపించకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురైన యాదయ్య, 6వ తేదీ మధ్యాహ్నం సుమారు 1:30 గంటల సమయంలో అదే పొలంలో ఉన్న బావిలో దూకి ప్రాణాలు తీసుకున్నాడు. అనంతరం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా,బావిలో తండ్రి యాదయ్యతో పాటు కుమారుడు కన్నయ్య మృతదేహాలు లభించాయి.
ప్రాథమిక విచారణలో బాలుడు ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయి మృతి చెందినట్లు,ఆ సంఘటనతో మనస్థాపానికి గురైన తండ్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది.
ఈ ఘటనపై కేశంపేట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్.70/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ప్రజలు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి, ఎస్ఐ రాజకుమార్ సూచించారు.

# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

## చించోడులో అవగాహన ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ స్రవంతి





**షాద్ నగర్, (ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం చించోడు గ్రామంలో ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని,రోగాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం చించోడు గ్రామ వీధుల్లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని డాక్టర్ స్రవంతి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,1948లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆవిర్భవించిన రోజును పురస్కరించుకొని ప్రతి ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.ఈ ఏడాది టుగెదర్ ఫర్ హెల్త్ స్టాండ్ విత్ సైన్స్ అనే ఇతివృత్తంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.చికిత్స కంటే ముందస్తు జాగ్రత్తలే మిన్న అని,ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తల సేవలను ఈ సందర్భంగా ఆమె కొనియాడారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు

ఆరోగ్యమే మహాభాగ్యం, అయోడిన్ లేని ఉప్పు-ఆరోగ్యానికి ముప్పు,మత్తు పదార్థాలు మానుకో-జీవితం సుఖవంతం చేసుకో అంటూ నినాదాలు చేస్తూ గ్రామ ప్రజలను చైతన్య పరిచారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ, సమతుల్య ఆహారం,వ్యక్తిగత పరిశుభ్రత,రోజుకు 8 గంటల నిద్ర, తగినంత నీరు తాగడం వంటి చిన్న చిన్న మార్పుల ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని వివరించారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగా, మెడిటేషన్ వంటివి అలవర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు శ్రీరామ,చంద్రకళ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్,హైస్కూల్ పి.ఇ.టి చంద్రశేఖర్,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ ముఖ్య కూడలి విస్తరణకు సహకరించండి

## పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మకు వినతి పత్రం.. అందజేసిన బిజెపి యువ నాయకులు కాసోజు శివ

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ పట్టణ ముఖ్య కూడలి విస్తరణకు సహకరించాలని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మకు వినతి పత్రం ఇచ్చిన బిజెపి యువ నాయకులు అడ్వకేట్ కాసోజు శివ.ముఖ్యంగా రోజు రోజుకి పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా షాద్ నగర్ ముఖ్య కూడలి ప్రజలకు చాలా ఇబ్బందులకు గురిచేస్తుందని రోడ్డు ఇరుకుగా ఉన్నందున సిగ్నల్స్ పడినప్పుడు వాహనాలు ఒక్కసారిగా కదలలేక ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని,గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నప్పటికీ షాద్ నగర్ ముఖ్య కూడలిని విస్తరణ చేయకపోవడం దాని వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని షాద్ నగర్ ప్రజల సమస్యలను



ఎంపీ డీకే అరుణమ్మ దృష్టికి తీసుకువచ్చి వారికి వివరంగా వివరించి ముఖ్య కూడలి విస్తరణ ఆవశ్యకతను వివరించి తెలియచేసి తొందరలోనే షాద్ నగర్ ముఖ్య కూడలిని విస్తరించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఈ విషయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలకు సహకరించాలని చెప్పి కోరుతూ మెమోరండం ఇవ్వడం జరిగిందని యువ న్యాయవాది బిజెపి యువ నాయకులు కాసోజు శివ తెలుపుతూ ఇందుకు ఎంపీ అరుణమ్మ సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడం జరిగిందని సాధ్యమైనంత తొందరలో షాద్ నగర్ ముఖ్య కూడలి విస్తరణకు సహకరిస్తానని తెలిపినట్లు బిజెపి యువ నాయకులు కాసోజు శివ సంతోషాన్ని వ్యక్తం చేసి ధన్యవాదములు తెలియజేసారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# రాయికల్ రహదారికి మహర్దశ..

## రూ.12 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

## భూమి పూజ చేసి,జెసిబితో పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని రాయికల్ నుంచి విట్యాల వరకు అత్యంత కీలకమైన రహదారి నిర్మాణానికి మోక్షం లభించింది.సుమారు 12 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న 9 కిలోమీటర్ల బీటీ రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం భూమి పూజ నిర్వహించారు. రాయికల్ సర్పంచి జ్యోతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాయికల్ కమాన్ వద్ద వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ఎమ్మెల్యే స్వయంగా జెసిబితో పనులను ప్రారంభించారు.

**అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే..**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్‌హెచ్ 44 నుంచి రాయికల్, రామేశ్వరం, జోగామ్మగూడ, విట్యాల, కంసాన్ పల్లి, భీమారం తదితర గ్రామాలకు ఇది ప్రధాన రహదారి అని పేర్కొన్నారు.ప్రసిద్ధి గాంచిన రామేశ్వరం దేవాలయానికి వచ్చే వేలాది మంది భక్తులు,స్థానిక ప్రజలు రహదారి సరిగ్గా లేక ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం కేవలం 'దంపుడు ఉపన్యాసాల'కే పరిమితమైందని, అభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు.
గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఈ రోడ్డు వేశారని, మళ్ళీ ఇప్పుడు తమ ప్రభుత్వంలోనే దీనికి మహర్దశ పట్టిందని ఆయన గుర్తు చేశారు.

**కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం..**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలని,
ఆ తర్వాత ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. రహదారి పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి కావడానికి కాంట్రాక్టర్లకు స్థానిక సర్పంచులు, నేతలు సహకరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, ఫరక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,కంసాన్పల్లి మాజీ ఎంపిటిసి శేఖర్,రామేశ్వరం సర్పంచ్ మానస సురేష్,అన్నారం సర్పంచ్ లావణ్య రామకృష్ణ, కడియాల కుంట తండా సర్పంచ్ రాజు నాయక్,ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్,కంసాన్ పల్లి సర్పంచ్ గీత యాదయ్య,మాజీ సర్పంచులు ఆశన్న గౌడ్,పాండు నాయక్, కృష్ణయ్య,రాజు నాయక్,రాములు గౌడ్,పెంటయ్య, శివ,రాఘవేందర్ గౌడ్,సంపత్,పార్టీ నాయకులు ముబారక్, సీతారాం, గోపీనాయక్,మైనార్టీ నాయకులు సమద్,రాయికల్,రామేశ్వరం, అన్నారం,విట్యాల,కంసాన్ పల్లి, కడియాల కుంట, ప్రజాప్రతినిధులు తదితర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేశంపేట్ లోని ఆదర్శ విద్యాలయం పాఠశాలలో ఆంగ్ల ఫెస్ట్ ఘనంగా నిర్వహణ

## కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి





**షాద్ నగర్(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని కేశంపేట ఆదర్శ విద్యాలయం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అలాగే (ఈఈఎల్ఎల్) వ్యవస్థాపకులు వెంకట్ పాల్గొన్న ఆంగ్ల ఫెస్ట్ కార్యక్రమాన్ని విద్యార్థుల ఉత్సాహం నడుమ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల ఆసక్తిని పెంపొందించడం,వారి కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ప్రధాన ఉద్దేశంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లంలో స్కిట్స్,పాటలు నృత్య ప్రదర్శనలు అందించి అందరినీ ఆకట్టుకున్నారు.ఆంగ్ల భాషలోనే నిర్వహించిన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాల రెడ్డి మాట్లాడుతూ, "ఇలాంటి ఫెస్ట్‌లు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయి.ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి ఇవి మంచి వేదికలు"అని అన్నారు. ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.
కార్యక్రమం చివర్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేసి అభినందించారు.ఈ ఆంగ్ల ఫెస్ట్ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ విజయవంతంగా ముగిసింది.

# అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

## 26 క్వింటాళ్లు స్వాధీనం, నిందితుడి అరెస్ట్




**నాగోల్,(ప్రజావినికిడి):**
పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. అప్రమత్తంగా వ్యవహరించిన నాగోల్ పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు.
నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారండఉమ్మడి నల్లగొండ జిల్లా తుర్కపల్లి మండలం పెన్ పహాడ్ గ్రామానికి చెందిన రవి నాయక్ అనే వ్యక్తి టీఎస్ 30 టీఏ 4286 నంబర్ గల టాటా ఏస్ వాహనంలో భారీగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా శంషాబాద్ ప్రాంతానికి తరలిస్తున్నాడు.
ఈ నేపథ్యంలో మంగళవారం నాగోల్ చౌరస్తా వద్ద ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధారణ వాహనాల తనిఖీలలో భాగంగా సంబంధిత వాహనంపై అనుమానం కలగడంతో పోలీసులు దానిని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలలో వాహనంలో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచి తరలిస్తున్నట్లు గుర్తించారు.
పరిశీలనలో భాగంగా వాహనంలో సుమారు 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు శంషాబాద్ ప్రాంతంలోని ఇటుక బట్టీల లో పనిచేసే కూలీలకు విక్రయించేందుకు వెళుతున్నట్లు నిర్ధారించినట్లు సిఐ పేర్కొన్నారు.
ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే ఈ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి లాభాపేక్షతో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై నిందితుడిపై 7 ఈసీ పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.
ఇలాంటి అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పదంగా రేషన్ సరుకుల తరలింపు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# నిజాంపేట్ లో ఫుట్ పాత్ ఆక్రమణల పై కఠిన చర్యలు...







**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** ఫుట్ పాత్ లను అక్రమంగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ హెచ్చరించారు. రహదారులపై ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అలాగే పాదాచారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అక్రమణా తొలగింపు చేపట్టినట్టు తెలిపారు.ఫుట్ పాత్ ల అక్రమణలను సహించరాదని, ఆయా ఆక్రమణల తొలగింపు,ఫుట్ పాత్ ల పునరుద్ధరణ నిరంతర కార్యక్రమంలా చేపట్టాలని మున్సిపల్ జిహెచ్ఎంసి అధికారులకు హైకోర్టు ఆదేశించింది. అందులో భాగంగా మంగళవారం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని వెంకట్రాయ నగర్, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ వసంత్ నగర్లో ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణ లను జిహెచ్ఎంసి అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబేర్అలీ టౌన్ ప్లానింగ్ ఏసిపి ప్రసీద పర్యవేక్షణలో జెసిబి సహాయంతో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు నిర్వహించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కమలానగర్ లో పర్యటించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
మంగళవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని
కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు అట్టి కాలనీ నందు పర్యటించారు.ఈ సందర్బంగా కాలనీవాసులు మాట్లాడుతూ కమలానగర్ రోడ్ నం.5 నందు వున్నా ఇన్‌స్టిట్యూట్ వద్ద జరుగుతున్న వర్షపునీటి అవుట్‌లెట్ విస్తరణ పనుల సమయంలో కమలానగర్ ప్రాంతంలోని అనధికార డ్రైనేజ్,ఎలక్ట్రికల్ మరియు నీటి కనెక్షన్లు కలపబడిన విషయం గుర్తించబడింది అని తెలిపారు.దీనితో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.అందువల్ల అట్టి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు పనులను వేగవంతం చేయాలని కోరారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే అధికారులచే మాట్లాడడం జరిగింది అని తెలిపారు.అతి త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుంది అని తెలిపారు.అలాగే బాక్స్ డ్రైన్స్ పనులు అతి త్వరలోనే చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్,గడ్డిఆన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,శ్రీశైలం యాదవ్,గండి సన్నీయాదవ్,నర్సింహా రావు,ఆనంద్,ప్రకాష్,గోపాల్,శ్రీనివాస్,ప్రభాకర్ చారి,రాము,ప్రదీప్,విక్కీ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రేషన్ బియ్యం గోదాంపై టాస్క్ ఫోర్స్ దాడులు

## దాదాపు 500 క్వింటాలు భారీ పట్టివేత..





**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
రేషన్ బియ్యం అక్రమ రవాణాపై వరుసగా వెలువడుతున్న పత్రికా కథనాల ప్రభావంతో రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై శాఖ కదిలింది. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి అక్రమ గోదాంలపై దాడులు చేపట్టగా, భారీగా రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మంగళపల్లి (బొంగులూరు) గేటు సమీపంలో ఉన్న ఓ గోదాంపై నిర్వహించిన ఆకస్మిక దాడిలో సుమారు 500 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడటం కలకలం రేపింది.తెలుగు దినపత్రికలు, ముఖ్యంగా "నవభూమి", "ప్రజాప్రశ్న"లో వెలువడిన కథనాల ఆధారంగా ఈ దాడులు చేపట్టినట్లు జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత వెల్లడించారు. పత్రికలు చూపించిన అడ్రస్‌లను ఆధారంగా తీసుకుని టాస్క్ ఫోర్స్ బృందాలు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించాయని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి,బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న మాఫియా గుట్టును ఈ దాడులతో రట్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.స్వాధీనం చేసుకున్న బియ్యం పరిమాణం చూస్తే ఈ అక్రమ వ్యాపారం ఎంత పెద్ద స్థాయిలో జరుగుతుందో అర్థమవుతుందని అధికారులు తెలిపారు.గోదాం నిర్వహణలో ఉన్న వ్యక్తులతో పాటు, షెడ్‌ను అద్దెకు ఇచ్చిన యజమాని కూడా ఈ దందాలో భాగస్వామి అయ్యి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.జిల్లా పరిధిలో ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం లభిస్తే వెంటనే స్పందించి దాడులు నిర్వహిస్తామనిడి డి సి ఎస్ ఓ వనజాత హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఎలాంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించబోమని, కేసులు నమోదు చేసి నేరస్తులను శిక్షిస్తామని ఆమె అన్నారు.ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా భారీ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమ సరఫరా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అధికారులు వెల్లడించారు.ఆ ప్రాంతాల్లో కూడా త్వరలో ప్రత్యేక దాడులు నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఈ వ్యవహారంపై ప్రజల్లో చైతన్యం పెరగడానికి పత్రికలు,ఛానళ్ల పాత్ర కీలకమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అక్రమాలను వెలికితీసే మీడియా కథనాలపై ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత కోసం మీడియా చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు.
ఈ దాడుల్లో శశిధర్,వెంకటేశం, పండరి, సాంబశివరావు, రామకృష్ణ, నరసింహారెడ్డి, మహేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు చేపట్టిన ఈ చర్యలతో అక్రమ రేషన్ బియ్యం మాఫియాకు గట్టి హెచ్చరిక వెళ్లినట్టైంది.

# రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు !

**ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఎపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచిదే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగునీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ తెలంగాణ అడుక్తికునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబాటుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీయాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుపడాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండడానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధానులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసినందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆర్ఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్ప, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత





కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ఢంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయాలి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కోవాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితంగా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకు పోవడం ఖాయం. నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్సరం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధజకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి మీద ద్వేషంతో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరాలతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యమా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు...ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరావతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచితంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించలేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్ధిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.

# ఈ యేడు వర్షాలు అంతంత మాత్రమే

## సగటుకన్నా తక్కువ వర్షపాతం నమోదు -వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడి

**న్యూఢిల్లీ ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. నైరుతి రుతువపనాలు కొనసాగే వర్షాకాలం రెండో భాగమైన జూన్-సెప్టెంబర్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల కాలంలో దీర్ఘకాలిక వర్షపాతం సగటున 868.6 మిల్లీమీటర్లు కాగా, అందులో 94 శాతం వర్షాలు మాత్రమే పడే అవకాశాలున్నాయని తెలిపింది. 2026 వర్షాకాలం సీజన్‌లో నమోదయ్యే వర్షపాతం అంచనాలను భారత వాతావరణ శాఖ వచ్చే వారంలో విడుదల చేయనుంది. భారత్‌లో




ఏడాదిలో నమోదయ్యే వర్షపాతంలో దాదాపు 70 శాతం వరకూ నైరుతి రుతుపవనాల వల్లే సాధ్యమవుతుంటుంది. నైరుతి రుతుపవనాలు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ వరి, పత్తి, చెరుకు సహా ఖరీఫ్ పంటల సాగుకు కీలకమవుతాయి. సాధారణంగా జూన్ 1 లేదా మొదటి వారంలో కేరళను రుతుపవనాలు తాకి, జూలై 15 నాటికి ఉత్తరాది సహా దేశమంతటా విస్తరిస్తాయి. కాగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ వచ్చే ఈశాన్య రుతుపవనాలు స్వల్పకాలికమే అయినా అగ్నేయ భారతదేశానికి, ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఈ వర్షాలు కీలకం. శీతాకాలంలో మధ్యధరా ప్రాంతం నుంచి వచ్చే అల్పపీడన వ్యవస్థల కారణంగా తేలిక పాటి నుంచి భారీ వర్షాలు, మంచు కురియడానికి కారణమవుతుంటాయి. అయితే ఈ వర్షాలు ఉత్తరభారతదేశంలో కీలకమైన రబీ పంటలు, ముఖ్యంగా గోధుమలకు చాలా ఉపయోగకరం.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం 9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ

## ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే -ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):** ప్రాచీనకాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ



2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దిన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ?

## కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

**టెహ్రాన్, ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా-ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మొజ్తాబా తీవ్ర అనారోగ్యంతో ఉన్నందువల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపింది అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుమారదు మొజ్తాబా ఖమేనీని తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. ÷రిజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు . కాగా, మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంపై వచ్చిన ఈ వార్తలు ఇరాన్ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు. అందువల్ల ఇప్పటికి ఇవి కేవలం నివేదికల ఆధారంగా వచ్చిన సమాచారం మాత్రమే.



# వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

## ఇక నుంచి 5 కెజీల రెండు సిలిండర్ల సరఫరా -సూచించిన కేంద్రం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీస్)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.




# ఆంధ్రజ్యోతిపై దాడి దుర్మార్గం

## తీవ్రంగా ఖండించిన మీడియా సంఘాలు

**అమరావతి ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడికి ప్రయత్నించడంపై మీడియా సంఘాలు స్పందించాయి. ఈ దాడిని ఐకేయూ, ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్, ఆర్ఎన్ఎ న్యూఏజెన్సీలు తీవ్రంగా ఖండించాయి. ఒక మీడియా సంస్థను నిర్వహిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇలాంటి చర్యలకు సొంత పార్టీలోని వారిని ఉసిగొల్పటం మీడియా స్వేచ్ఛపై దాడిగా భావించక తప్పదని జర్నలిస్టు సంఘాల నేతలు డి.సోమసుందర్, ఐ.వి.సుబ్బారావు, ఏచూరి శివ (ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్), ఆర్ఎన్ఎ చీఫ్ ఎడిటర్ అవ్వారు రఘు స్పష్టం చేశారు. ఏపీ రాజధానిగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ కొత్త రాజధానిని ఏర్పాటు చేయాలని.. దానికి మావిగన్ అనే పేరు పెట్టాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిపాదించారు. అది కూడా రాజధాని అమరావతి బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందే క్రమంలో వైఎస్ జగన్ ఈ ప్రతిపాదన చేయడం విమర్శలకు తావిచ్చింది. నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ తన కొత్త పలుకులో ప్రత్యేక కథనాన్ని రాశారు. దీనిపై వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున మండిపడ్డాయి. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో ఆ పార్టీలోని కీలక నేతలు వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి.. స్పందించారు. అందులోభాగంగా మంగళవారం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

# రాజధానిగా అమరావతి చట్టబద్ధత

## గెజిట్ విడుదలపై ఏపీ హైకోర్టు న్యాయవాదులు హర్షం

**అమరావతి, ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
రాజధానిగా అమరావతి చట్టబద్ధత, గెజిట్ విడుదలపై ఏపీ హైకోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు సమీపంలో న్యాయవాదుల ఆధ్వర్వంలో అమరావతి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాజధాని రైతులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. న్యాయమూర్తుల బంగ్లాల నుంచి హైకోర్టు వరకు ర్యాలీగా వెళ్లారు. ఆపై న్యాయస్థానం వద్ద జాతీయ పతాకానికి న్యాయవాదులు, రైతులు నమస్కారం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రాజధాని అమరావతిని కాపాడిన ప్రాణదాతగా నాటి మండలి చైర్మన్ మహ్మద్ షరీఫ్‌కు పువ్వులు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు రాజధాని రైతులు. న్యాయస్థానం, శాసనమండలి చొరవతో అమరావతి అజరామరమైందని రైతులు తెలిపారు. హైకోర్టు ముందున్న త్రివర్ణపతాకం ఎదుట నిలబడి 'జై అమరావతి' అంటూ నినాదాలు చేశారు. అమరావతిని కాపాడినందుకు హైకోర్టుకు రైతులు హారతి పట్టి, సాష్టాంగ నమస్కారం చేశారు. హైకోర్టు వద్ద సంబరాల్లో శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్య రావు, రెరా చైర్మన్ శివారెడ్డి, గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ గోనుగుండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఏపీ అగ్నిమాపక శాఖకు కొత్త రూపు...

## ఆధునిక వాహనాలు, పరికరాలు ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**అమరావతి ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. శాఖ ఆధునికీకరణలో భాగంగా మొత్తం రూ.252.93 కోట్లతో చేపట్టిన ప్రణాళికలో తొలి దశగా, రూ.33.25 కోట్ల విలువైన నూతన వాహనాలు, అత్యాధునిక పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జెండా ఊపి కొత్త వాహనాలను సేవలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా అధికారులు కొనుగోలు చేసిన పరికరాలు, వాహనాల పనితీరును ముఖ్యమంత్రికి వివరించారు. తొలి విడతలో భాగంగా రూ.18 కోట్ల వ్యయంతో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంపులు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 అత్యవసర రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను ప్రభుత్వం సమకూర్చింది. కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించుకుని ఈ పరికరాలను అందుబాటులోకి తెచ్చిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడటానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. రాజధానితో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఎత్తైన భవనాల (హై-రైజ్ బిల్డింగ్‌లు) నిర్మాణం పెరుగుతున్నందున, వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ ఆధునిక పరికరాలను సమకూర్చుకోవాలని సూచించారు. గతంలో అగ్నిమాపక విభాగంలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేదని, మళ్లీ అదే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సైతం సహాయం చేసిన ఘనమైన చరిత్ర మనకు ఉందని గుర్తుచేశారు. అన్ని సవాళ్లను అధిగమించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా సద్వినియోగం చేసుకుని అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక

**సూర్యాపేటఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**



అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై కట్టుదిట్టమైన నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉందని తెలిపారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తమ ప్రభుత్వం సన్నద్ధమైందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అందుబాటులో 16 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయని తెలిపారు. అంతకుముందు హుజూర్ నగర్ రామస్వామి గట్టు సమీపంలో ఐటీ కాలేజీతో పాటు మోడల్ కాలనీ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో 116 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని చెప్పుకొచ్చారు. కాలనీ నిర్మాణానికి రూ.125 కోట్లు ఖర్చు, అదనంగా రూ.20 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదటి విడతలో 1500 మంది లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.




# యూరియాను శాస్త్రీయంగా వాడాలి

## యూరియా యాప్ పై హర్షం వ్యక్తం చేసిన రైతులు

## అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంది -మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల, నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడ పీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పుడు పంటల కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని అన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా.. ఈ రోజు నిర్వహించి రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి సచివాలయం నుండి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రిగారు.. యూరియా యాప్ మరియు యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను



నివృత్తి చేయడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్ పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్ తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకోని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కాకుండా ఉందని రైతులు యూరియా యాప్ ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్ తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని, రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రిగారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధిక యూరియా వాడకం ద్వారా వచ్చే అనర్థాలను రైతులకు మంత్రి వివరించారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని, పామాయిల్ పంటను వేసి కూడా వరి, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు పండించుకోవచ్చని రైతులకు వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందని అన్నారు. సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, సర్పంచ్ లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.

# రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులు

**అమరావతిఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 16వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (రాఫ్డీ) సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పలు
రంగాల్లో మొత్తం రూ.39,436.84 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పి. నారాయణ, కందుల దుర్గేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**ఎస్ఐపీబీ ఆమోదం పొందిన పెట్టుబడుల వివరాలు:**
విద్యుత్ రంగం (8 ప్రాజెక్టులు): మొత్తం పెట్టుబడి రూ.12,552 కోట్లు, ఉద్యోగాలు 69,070.
1. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప, అనంతపురం జిల్లాల్లో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు.
2. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప జిల్లాలో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు.
3. ఎస్సార్ రెన్యువబుల్స్ సోలార్ టు లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.1,327 కోట్ల పెట్టుబడితో 1,035 ఉద్యోగాలు.
4. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.2,714 కోట్ల పెట్టుబడితో 1,240 ఉద్యోగాలు.
5. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్: అనంతపురం జిల్లాలో రూ.1,714 కోట్ల పెట్టుబడితో



220 ఉద్యోగాలు.
6. పేస్ డిజిటెక్ ప్రైవేట్ లిమిటెడ్: కడప జిల్లాలో రూ.745 కోట్ల పెట్టుబడితో 345 ఉద్యోగాలు.
7. ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్: పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఏలూరు, విజయనగరం జిల్లాల్లో రూ.3,200 కోట్ల పెట్టుబడితో 65,000 ఉద్యోగాలు.
8. హెచ్‌హెచ్‌పీ ఎయిట్ ప్రైవేట్ లిమిటెడ్: తిరుపతి జిల్లాలో రూ.70 కోట్ల పెట్టుబడితో 850 ఉద్యోగాలు.
ఐటీ, ఎలక్ట్రానిక్స్ (11 ప్రాజెక్టులు): మొత్తం పెట్టుబడి రూ.18,210.36 కోట్లు, ఉద్యోగాలు 36,411.
9. ఇన్ఫోసిస్ లిమిటెడ్: విశాఖ యండాడలో రూ.750 కోట్లతో 7,000 ఉద్యోగాలు.
10. క్రెడెన్స్ రియాలిటీ: విశాఖ తాళ్లవలసలో రూ.386.88 కోట్లతో 6,500 ఉద్యోగాలు.
11. ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్: విశాఖ కాపులుప్పాడలో రూ.425 కోట్లతో 2,500 ఉద్యోగాలు.
12. శ్రీటెక్ డేటా లిమిటెడ్: విశాఖ కాపులుప్పాడలో రూ.1,800 కోట్ల పెట్టుబడి.
13. పీజీ టెక్నోప్లాస్ట్: తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1,305 కోట్లతో 2,910 ఉద్యోగాలు.
14. ఎన్‌పీఎస్‌పీఎల్ స్పెషాలిటీ కెమికల్స్: చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.2,550 కోట్లతో 400 ఉద్యోగాలు.
15. ఐస్ప్రౌట్ బిజినెస్ సెంటర్: విశాఖపట్నంలో రూ.626.90 కోట్లతో 12,500 ఉద్యోగాలు.
16. ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్: శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.10,239.78 కోట్లతో 3,017 ఉద్యోగాలు.
17. సీ డాక్: అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.17 కోట్లతో 12 ఉద్యోగాలు.
18. పీక్యూ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్: అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.1.8 కోట్లతో 20 ఉద్యోగాలు.
19. క్వాంటం ఏఐ గ్లోబల్: అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.108 కోట్లతో 1,552 ఉద్యోగాలు.
పర్యాటక రంగం (2 ప్రాజెక్టులు): పెట్టుబడి రూ.200.15 కోట్లు, ఉద్యోగాలు 270.
20. సన్ రే గ్రీన్ స్పేస్: విజయనగరంలో రూ.117.66 కోట్లతో 150 ఉద్యోగాలు.
21. రవిప్రియ హాస్పిటాలిటీస్: ఒంగోలులో రూ.82.49 కోట్లతో 120 ఉద్యోగాలు.
ఫుడ్ ప్రాసెసింగ్ (2 ప్రాజెక్టులు): పెట్టుబడి రూ.1,222.73 కోట్లు, ఉద్యోగాలు 550.
22. ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్: తిరుపతిలో రూ.233.73 కోట్లతో 100 ఉద్యోగాలు.
23. రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్: చిత్తూరులో రూ.989 కోట్లతో 450 ఉద్యోగాలు.
పరిశ్రమలు, వాణిజ్యం (8 ప్రాజెక్టులు): పెట్టుబడి రూ.7,251.6 కోట్లు, ఉద్యోగాలు 4,977.
24. మెట్రో డెకరేటివ్ లిమిటెడ్: నాయుడుపేటలో రూ.1,032 కోట్లతో 400 ఉద్యోగాలు.
25. ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా: విశాఖలో రూ.1,400 కోట్లతో 250 ఉద్యోగాలు.
26. శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ: నెల్లూరులో రూ.3,678 కోట్లతో 3,200 ఉద్యోగాలు.
27. బాల్ బెవరేజెస్ ప్యాకేజింగ్: శ్రీసిటీలో రూ.633 కోట్లతో 117 ఉద్యోగాలు.
28. సాన్సో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్: ఏలూరులో రూ.80 కోట్లతో 210 ఉద్యోగాలు.
29. ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్: శ్రీసిటీలో రూ.143.99 కోట్లతో 350 ఉద్యోగాలు.
30. వెంకటేశ్వర పేపర్ ప్రోడక్ట్స్: కృష్ణా జిల్లాలో రూ.63.61 కోట్లతో 100 ఉద్యోగాలు.
31. అనాడ్రోన్ సిస్టమ్స్: నెల్లూరులో రూ.221 కోట్లతో 350 ఉద్యోగాలు.

# తిరిగి ప్రారంభమైన 'ఎన్టీఆర్ వైద్య సేవ'

**అమరావతి, ఏప్రిల్ 7 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇది ఊరట కలిగించే వార్త. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం తిరిగి ప్రారంభమైంది. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించడంతో ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ (ఆషా) తమ సమ్మెను విరమించుకుంది. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో యథావిధిగా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.
ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించడంతోనే సమ్మె విరమించినట్లు 'ఆషా' ప్రతినిధులు తెలిపారు. మొత్తం బకాయిల్లో భాగంగా రూ.1,000 కోట్లను 10 రోజుల్లో చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మిగిలిన రూ.1,000 కోట్ల బకాయిలను రెండో త్రైమాసికంలో చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. ఈ హామీతో నెట్‌వర్క్ ఆసుపత్రులు తమ సేవలను పునరుద్ధరించాయి.
గత కొంతకాలంగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో 'ఆషా' సమ్మెకు దిగిన విషయం






తెలిసిందే. దీనివల్ల 'ఎన్టీఆర్ ఆరోగ్య సేవ' పథకం కింద చికిత్స పొందే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం, 'ఆషా' మధ్య ఒప్పందం కుదరడంతో రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం మళ్లీ అందుబాటులోకి వచ్చింది. ఇచ్చిన హామీలను ప్రభుత్వం సకాలంలో నెరవేరుస్తుందని ఆశిస్తున్నట్లు 'ఆషా' వర్గాలు పేర్కొన్నాయి.

# డేవిడ్ వార్నర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు



ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ పీకల దాకా మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. సిడ్నీలోని మౌబ్రా ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న వార్నర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వెంటనే స్థానిక స్టేషన్‌కు తరలించారు. ఆస్ట్రేలియాలో అనుమతించిన దానికంటే దాదాపు రెట్టింపు స్థాయిలో మద్యం సేవించి అతడు డ్రైవింగ్ చేసినట్లు బ్రీత్ అనలైజర్ పరీక్షలో తేలింది. తప్పతాగి కారు నడుపుతూ ఆస్ట్రేలియా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను అతడిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడేందుకు వెళ్లిన వార్నర్, మే నెలలో జరిగే కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల్లో డేవిడ్ భాయ్ గా విశేష ప్రజాదరణ పొందిన వార్నర్ ఇలా తాగి పట్టుబడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సోషల్ మీడియాలో టాలీవుడ్ పాటలకు డ్యాన్సులు చేస్తూ ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఈ స్టార్ ఆటగాడు, ఇప్పుడు ఏకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అరెస్టై పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కడం క్రీడా వర్గాల్లో సంచలనంగా మారింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 5వ తేదీ ఆదివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో మలబార్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఆపి ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఒక వ్యాన్ తనిఖీ కేంద్రానికి కొద్దిగా దూరంలోనే ఆగిపోయింది. దీనిని గమనించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని వాహనంలో ఉన్న 39 ఏళ్ల వార్నర్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అతను పరిమితికి మించి మద్యం తాగినట్లు పాజిటివ్ ఫలితం వచ్చింది. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్న అధికారులు మౌబ్రా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన మరో పరీక్షలో అతని రక్తంలో 0.1 శాతం ఆల్కహాల్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. చట్ట ప్రకారం ఇది నేరం కావడంతో అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేశారు.

# జట్టులో చేరనున్న మిచెల్ స్టార్క్



ఈ ఐపీఎల్ సీజన్ లో ఇప్పటివరకు బోణీ కొట్టని జట్లు అంటూ ఏవైనా ఉన్నాయంటే అవి చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్. ఈ రెండు జట్లు కూడా ఆడిన మ్యాచ్ లన్నీ ఓడిపోయాయి. చెన్నై మూడు, గుజరాత్ రెండింట్లో పరాజయం పాలయ్యాయి. తమ ప్రత్యర్థులకు రెండేసి చొప్పున పాయింట్లను ధారదాత్తం చేశాయి. ఈ వరుస ఓటములు చెన్నై సూపర్ కింగ్స్ ను మాత్రం తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. హేటర్స్ కు ట్రోలింగ్ స్టఫ్ ను అందించాయి. ఈ పరిస్థితుల మధ్య ఈ రెండు జట్లనూ ఎదుర్కొనబోతోంది ఢిల్లీ కేపిటల్స్. దెబ్బతిన్న పులుల్లా ఉన్న గుజరాత్, చెన్నైతో ఈ నెల 8, 11 తేదీల్లో మ్యాచ్ లను ఆడాల్సి ఉంది. 18న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొట్టబోతోంది. ఇప్పుడీ మూడు మ్యాచ్ లకు కూడా స్టార్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ దూరం అయ్యాడు. ఇప్పటివరకు ఆడిన రెండింట్లోనూ నెగ్గి దూకుడు మీదున్న ఢిల్లీ కేపిటల్స్.. తన జైత్రయాత్రను కొనసాగించాలంటే స్టార్క్ అవసరం ఎంతైనా ఉంది. ఈ స్టార్ ఆటగాడు మరో మూడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని తెలుస్తోంది. భుజం, మోచేతి గాయాల నుంచి ఆస్ట్రేలియాలో ట్రీట్మెంట్ తీసుకున్నాడు. అక్కడే కోలుకుంటోన్నాడు. ఇప్పటివరకు జట్టుతో కలవలేదు కూడా. అత్యంత కీలకమైన ఈ మూడు మ్యాచ్ లకూ ఈ స్టార్ బౌలర్ సేవలను జట్టు కోల్పోనుంది. మిచెల్ స్టార్క్ ఈ సీజన్‌లో ఏదో ఒక సమయంలో జట్టుతో చేరతాడని ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ఆశాభావంతో ఉంది. ఈ ఎడమచేతి వాటం బౌలర్ లేనప్పటికీ అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్‌పై విజయం సాధించింది. బౌలింగ్ యూనిట్ అద్భుత ప్రదర్శన చేసింది. ముఖేష్ కుమార్, లుంగి ఎన్‌గిడి, టీ నటరాజన్ కీలక ఓవర్లలో కచ్చితత్వంతో బౌలింగ్ చేశారు. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, విప్రజ్ నిగమ్ వంటి స్పిన్నర్లు మిడిల్ ఓవర్లల్లో సత్తా చాటుతున్నారు. చెన్నై, గుజరాత్, బెంగళూరుతో ఆడాలంటే మాత్రం అదనపు బౌలింగ్ వనరులు తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో స్టార్క్ జట్టులో చేరితే బాగుంటుందని ఆశించింది గానీ, అది సాధ్యపడేలా లేదు. గాయంతో ఉన్నప్పటికీ స్టార్క్ జట్టు యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నాడు. ప్రస్తుతం భుజం, మోచేతికి అయిన గాయం నుంచి కోలుకుంటున్నానని, వీలైనంత త్వరగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరడానికి కట్టుబడి ఉన్నానని స్టార్క్ స్పష్టం చేశాడు. ఈ సీజన్ ప్రారంభంలో అందుబాటులో లేనందుకు అభిమానులకు క్షమాపణ సైతం చెప్పాడు.

# సీఎస్‌కేలో పెను మార్పులు తప్పవా?



ఐపీఎల్ 2026 సీజన్‌లో పాత వైభవానికి దూరమైన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( తో జరిగిన మ్యాచ్‌లో ఎదురైన ఘోర పరాజయం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో, తదుపరి మ్యాచ్‌లో జట్టును తిరిగి విజయాల బాట పట్టించేందుకు యాజమాన్యం, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ భారీ మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రధానంగా దిగ్గజ ఆటగాడు ఎంఎస్ ధోనీ కీలక బాధ్యతల్లో కనిపించనుండగా, 'బేబీ ఏబీ'గా పిలవబడే డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్సీబీతో జరిగిన పోరులో సీఎస్‌కే బ్యాటింగ్ మరియు బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా విఫలమైంది. ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధిస్తున్నా బౌలర్లు కట్టడి చేయలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో సీఎస్‌కే బౌలింగ్ దారుణంగా ఉంది. బ్యాటింగ్‌లో కూడా టాపార్డర్ విఫలమవ్వడం జట్టును పతనం అంచుకు తీసుకెళ్లింది. ఈ పరాజయంపై సోషల్ మీడియాలో అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని మ్యాచ్‌లుగా ధోనీ కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే పరిమితమవుతున్నారు. అయితే, జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ధోనీ అనుభవం అవసరమని యాజమాన్యం భావిస్తోంది. మైదానంలో వ్యూహరచనలో కెప్టెన్ రుతురాజ్‌కు ధోనీ మరింత చురుగ్గా సహకరించనున్నారు. ముఖ్యంగా ఫీల్డ్ సెట్టింగ్, బౌలింగ్ మార్పుల విషయంలో ధోనీ మార్క్ నిర్ణయాలు తదుపరి మ్యాచ్‌లో కనిపిస్తాయని సమాచారం. ధోనీ ఫిట్‌నెస్‌పై కొన్ని అనుమానాలు ఉన్నప్పటికీ, జట్టును గట్టెక్కించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ ప్రస్తుతం సీఎస్‌కే బెంచ్‌కే పరిమితమయ్యాడు. కానీ, మిడిలార్డర్ విఫలమవుతుండటంతో అటాకింగ్ బ్యాటర్ అవసరమని జట్టు భావిస్తోంది. బ్రెవిస్ తనదైన శైలిలో సిక్సర్ల వర్షం కురిపించగలడు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో అతని సామర్థ్యం జట్టుకు అదనపు బలంగా మారుతుంది. విదేశీ ఆటగాళ్ల కోటాలో ఒకరిని తప్పించి బ్రెవిస్‌ను తుది జట్టులోకి తీసుకునే యోచనలో కోచ్ ఫ్లెమింగ్ ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.





# నటితో క్రికెటర్ అర్ష్‌దీప్ సింగ్ డేటింగ్!

ఐపీఎల్ 2026లో టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. తాజాగా తన వ్యక్తిగత జీవితంతో అర్ష్‌దీప్ వార్తల్లో నిలిచాడు. క్రికెటర్ ఒక అమ్మాయి చేయి పట్టుకున్నట్లు కనిపిస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది అభిమానులు చేతిపై టాటూ, గోళ్లపై ఉన్న ఆర్ట్ గుర్తించి, ఆమె మరెవరో కాదు సగ్రీన్ కౌర్ అని చెబుతున్నారు. ఇక అది మొదలుకుని అర్ష్‌దీప్, సగ్రీన్ ప్రేమలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అర్ష్‌దీప్ సింగ్ షేర్ చేసిన ఫొటోలలో తను ఒక అమ్మాయి చేయి పట్టుకున్నాడు. కానీ అందులో ఆమె ముఖం కనిపించడం లేదు. అమ్మాయి చేతిపై చిన్న టాటూ మాత్రం ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అభిమానులు ఈ టాటూతో అమ్మాయి ఎవరని గుర్తించారు. ఆమె పంజాబీ నటి సగ్రీన్ కౌర్ అని చెబుతున్నారు. క్రికెటర్ ఫోటోలో అమ్మాయి చేతిపై ఉన్న టాటూ, చేతిపై ఉన్న టాటూ ఒకేలా ఉన్నాయని అంటున్నారు. ఆ తర్వాత సగ్రీన్ కౌర్ మ్యాచ్‌లు చేసేందుకు స్టేడియానికి రాగా.. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో ఫొటోలు షేర్ చేసింది.

# రాజస్థాన్, ముంబై మ్యాచ్‌కు ఆటంకం..

ఐపీఎల్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థార్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మధ్య గౌహతి వేదికగా జరగాల్సిన మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభం కానుంది. షెడ్యూల్ ప్రకారం 7 గంటలకే టాస్ వేయాల్సి ఉండగా.. వర్షం ఆటంకం కలిగిస్తోంది. గౌహతిలో గత మూడు గంటల నుంచి వర్షం పడుతోంది. సాయంత్రం 4.30 గంటల నుంచే చిన్నపాటి వర్షం మొదలైంది. దాంతో మైదానాన్ని పూర్తిగా కవర్లతో కప్పేసారు. వర్షం ఆగితేనే ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. లేకుంటే టాస్ పడకుండానే రద్దయ్యే ప్రమాదం పొంచి ఉంది. కనీసం ఐదు ఓవర్ల ఆటను నిర్వహించేందుకు కటాఫ్ టైమ్ 10.56 గంటలుగా నిర్ణయించారు. అప్పటి వరకు అంపైర్లు వేచి చూడనున్నారు. కనీసం 5 ఓవర్ల ఆట సాధ్యమైతేనే మ్యాచ్ ఫలితాన్ని తేల్చనున్నారు. లేదంటే రద్దు చేసి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయిస్తారు. సోమవారం కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్ మధ్య కోల్‌కతా వేదికగా జరగాల్సిన మ్యాచ్‌కు వర్షార్పణమైన సంగతి తెలిసిందే. వరుసగా రెండు మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించడంతో ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్‌లో శుభారంభం అందుకున్న ముంబై ఇండియన్స్.. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఓటమిపాలైంది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఎలాగైన విజయం సాధించి మళ్లీ విజయాల బాట పట్టాలనే కసితో ముంబై ఇండియన్స్ ఉంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించి జోరు మీద ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి హ్యాట్రిక్ విక్టరీ కొట్టాలని భావిస్తోంది.

## ఐపీఎల్ వల్లే సర్వనాశనమయ్యా.. : ఇంగ్లాండ్ దిగ్గజ బ్యాటర్ కెవిన్ పీటర్సన్



భారత ప్రీమియర్ లీగ్ ఎంతోమందికి వరంగా మారితే, తన విషయంలో మాత్రం అది శాపంగా మారిందని ఇంగ్లాండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఐపీఎల్ వల్ల తన క్రికెట్ ప్రయాణం ఎలా దెబ్బతిన్నదో వివరిస్తూ ఆయన ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుపై తీవ్ర విమర్శలు గుప్పించాడు. పీటర్సన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తాను ఐపీఎల్‌లో ఆడాలని నిర్ణయించుకున్న సమయం నుంచి ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు తనపై కక్షగట్టిందని పేర్కొన్నాడు. తాను భారత్‌లో జరుగుతున్న ఈ లీగ్‌లో పాల్గొనడం బోర్డులోని పెద్దలకు నచ్చలేదని, అందుకే తనపై రకరకాల కుట్రలు పన్నా రని ఆయన ఆరోపించాడు. మీడియాను కూడా తనపైకి ఉసిగొ ల్పి, తన ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నించారని పీటర్సన్ వాపోయాడు. “నేను ఐపీఎల్ కోసం చాలా త్యాగాలు చేశాను. ఆ నిర్ణయం వల్లే నా కెరీర్ నాశనమైంది. నేను ఇంగ్లాండ్ తరపున 104 టెస్టులు ఆడాను, కానీ నాకు 150 నుంచి 160 టెస్టులు ఆడే సత్తా ఉంది. కేవలం బోర్డు వ్యతిరేకత వల్లే 33 ఏళ్లకే నా అంతర్జాతీయ క్రికెట్ ముగిసిపోయింది” అని ఆయన తెలిపాడు. ప్రస్తుత ఇంగ్లాండ్ ఆటగాడు జోస్ బట్లర్ తనకు కృతజ్ఞతలు చెప్పాడని, తన పోరాటం వల్లే నేడు ఇంగ్లాండ్ ఆటగాళ్లందరికీ ఐపీఎల్‌లో ఆడే స్వేచ్ఛ దొరికిందని పీటర్సన్ గుర్తుచేశాడు. ఇంతటి అద్భుతమైన రికార్డు ఉన్నప్పటికీ, రాజకీ యాల కారణంగా తాను త్వరగా రిటైర్ అవ్వాల్సి వచ్చిందని ఆ యన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి.


# వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రేలకు బీసీసీఐ షాక్



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రతిష్టాత్మకంగా భావించే అండర్-25 జట్టు ఎంపికలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాబోయే కాలంలో భారత టెస్ట్ జట్టుకు వెన్నెముకగా నిలిచే ఆటగాళ్లను గుర్తించేందుకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రత్యేక టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన 25 మంది సభ్యుల జాబితాలో వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే పేర్లు లేకపోవడం గమనార్హం. శ్రీలంకలో జరగనున్న రెడ్ బాల్ క్రికెట్ సిరీస్ కోసం భారత అండర్-19, అండర్-25 జట్లు పయనమవనున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడింది. ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ ముగిసిన వెంటనే, బీసీసీఐ ఈ ప్రత్యేక నాలుగు రోజుల మ్యాచ్‌ల టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 64 మంది అత్యుత్తమ యువ క్రికెటర్లను నాలుగు జట్లుగా విభజించి ఈ పోటీలు నిర్వహిస్తారు. ఈ ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి ఒక ప్రత్యేక ప్రాతిపదికను అనుసరించారు. అందులో 25 మంది ఆటగాళ్లు సి.కె. నాయుడు ట్రోఫీ, అండర్-23 వన్డే మ్యాచ్‌ల నుంచి, మరో 25 మంది ఆటగాళ్లను రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ వంటి ప్రధాన టోర్నీల నుంచి ఎంపిక చేశారు. మిగిలిన 14 స్థానాలను ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా భర్తీ చేయనున్నారు. వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మ్హాత్రే వంటి మేటి ఆటగాళ్లను ప్రాథమిక జాబితాలో చేర్చకపోవడానికి ఒక బలమైన కారణం ఉంది. వీరిద్దరూ ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బిజీగా ఉన్నారు. ఆయుష్ మ్హాత్రే చెన్నై సూపర్ కింగ్స్ తరపున, వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో సభ్యులుగా ఉన్నారు. ఐపీఎల్ ముగిసిన తర్వాత ఎంపిక చేసే టాప్ 14 మంది ఆటగాళ్ల జాబితాలో వీరి పేర్లు ఉండే అవకాశం మెండుగా ఉందని సమాచారం. కాబట్టి అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎంపికైన జట్టులో ఆయుష్ దోసేజా, యశ్ ధుల్, మయాంక్ వర్మ, ఆయుష్ పాండే, శాశ్వత్ రావత్, మహేష్ పిథియా, రాజ్ లింభాని, ఆర్య దేశాయ్, సిద్ధార్థ్ దేశాయ్, ఆకిబ్ ఖాన్, కార్తీక్ యాదవ్, విద్యాధర్ పాటిల్, కె. హిమతేజ, భువనగిరి పున్నయ్య, పుఖరాజ్ మాన్, యశవర్ధన్ దలాల్, పార్థ్ వత్స్, ఈడెన్ ఆపిల్ టామ్, హిమాన్షు సింగ్, అమన్ మోఖడే వంటి ఆటగాళ్లు ఉన్నారు.

# పెద్ది విడుదల జూన్‌కు మారినట్లేనా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదల తేదీపై గందరగోళం నెలకొంది. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా పరిణామాలు చూస్తుంటే ఆ తేదీకి రావడం కష్టమేనని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ' ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ సినిమా వాయిదా పడే అవకాశాలపై వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆయన తర్వాత వివరణ ఇచ్చారు. మరోవైపు, 'రాకాస' టీంతో మాట్లాడిన సమయంలో 'సినిమా లేట్ అవ్వదు' అని రామ్ చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ కాస్త కూల్ అయ్యారు. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే వాయిదా అనివార్యంగా కనిపిస్తోంది.



తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా జూన్ నెలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ రెండు తేదీలను పరిశీలిస్తోంది. జూన్ 4 లేదా జూన్ 24. ఈ తేదీల్లో ఏదో ఒకదానిని ఫైనల్ చేయాలని భావిస్తున్నారు. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. కీలక సన్నివేశాల్లో రామ్ చరణ్ పాల్గొంటూ బిజీగా ఉన్నారు. సినిమాను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు టీమ్ కష్టపడుతోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ముఖ్య పాత్రల్లో శివరాజ్ కుమార్, జగపతిబాబు , అలాగే 'మిర్జాపూర్' ఫేమ్ దివ్యేందు శర్మ కనిపించనున్నారు. సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన పొందాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రాగానే ప్రమోషన్స్‌ను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేలా యూనిట్ ప్లాన్ చేస్తోంది.

# అట్లీ, అల్లు అర్జున్ మూవీ పోస్టర్ విడుదల

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ22ఎక్స్ 6'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది. సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతో పాటు... విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో దీపికా పదుకొణె పేరు ఇప్పటికే ఖరారైంది.

-------



# అల్లరి నరేశ్ 'కనక దుర్గ'...

## కెమెరా స్విచాన్ చేసిన కొణిదెల సురేఖ



విలక్షణ నటుడు అల్లరి నరేశ్ హీరోగా 'కనక దుర్గ' అనే కొత్త చిత్రం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సురేఖ కొణిదెల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమిళ చిత్ర పరిశ్రమలో విజయవంతమైన నిర్మాణ సంస్థ అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. టెంపుల్ టౌన్ పిక్చర్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్న ఈ భక్తి ప్రధాన యాక్షన్ చిత్రానికి బీవీఎస్ రవి కథను అందించారు. ఇందులో కాజల్ చౌదరి హీరోయిన్‌గా, సుబ్బరాజు కీలక పాత్రలో నటించనున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, మెగాస్టార్ చిరంజీవి అర్ధాంగి కొణిదెల సురేఖ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్వప్న దత్ గౌరవ దర్శకత్వం వహించారు.భక్తి, యాక్షన్, భావోద్వేగాల కలయికగా ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం తెలిపింది. ఈ కార్యక్రమానికి అల్లు అరవింద్‌తో పాటు శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీశ్ శంకర్, ప్రశాంత్ వర్మ, కోన వెంకట్, స్వప్న దత్ వంటి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు.దక్షిణ భారతంలో తమ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ, ఇప్పుడు 'కనక దుర్గ'తో తెలుగులోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు.



# అవును పెళ్లయ్యింది.... నలుగురు పిల్లలు

## విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై

కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.

# అనన్య పాండే మూవీ చాంద్ మేరా దిల్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

------



# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ



'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది.టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎ÷-లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట.అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613